ధాత ఉగాది కథలపోటీలో బహుమతి పొందిన కథ

# ఎదురీత

- డి. కామేశ్వరి

రైలు దిగి ఇంటికి వచ్చి స్నానం చేసి కాఫీ తాగుతుండగానే తల్లి చెప్పిన మాట విని ఆశ్చర్యపోయింది నిర్మల. తెల్లపోతూ అర్థం కానట్టు చూసింది. అసలు కూతురు ఇంట్లోకి అడుగు పెట్టగానే అ మాట చెప్పడానికి ఉగ్గబట్టుకుని ఎదురుచూసింది కమలమ్మ. కాఫీగ్లాసు అందిస్తూ, 'చూశావుటే, నీ ఫ్రెండ్ జానకి ఎంతపని చేసిందో!' అందావిడ ఉపోద్ఘాతంగా. 'ఏం చేసింది..' అరాటంగా అడిగింది నిర్మల. ఏం చేసింది- కొంపదీసి అఘాయిత్యం చేయలేదు కదా, వంటిరిగా బతకలేక పిల్లలకింత విషం ఇచ్చి తనింత తిందా.. అరక్షణంలో మనసులో మెదిలాయి రకరకాల ఆలోచనలు. తల్లి మొహంలో కనబడిన తిరస్కారభావం చూడగానే అలాంటిది కాక, ఇంకేదో జరిగిందేమో ననిపించింది. - మళ్ళీ పెళ్ళి ఏమన్నా చేసుకుందా. "ఏం చేసిందమ్మా" ఆరాటంగా మళ్ళీ అడిగింది.

"మళ్ళీ పెళ్ళేమన్నా చేసుకుందా-"

"అలా అయినా బాగుండును.. ఈ దొంగచాటు పనులు కాకుండా అలా ఎవడినో చేసుకున్నా ఎవరూ ఏం అనుకునేవారు కారు. అవ్వ, మొగుడుపోయిన రెండు నెలలకే.. ఆ సుధాకర్ లేడూ.. అదే వాళ్ళాయన ఫ్రెండుట- ఆ బ్యాంకులోనే పని చేస్తాడట, వాడ్ని తెచ్చుకుని ఇంట్లోనే పెట్టుకుంది డైరెక్ట్‌గా. నాలుగునెలల నుంచీ వాడితోనే ఉంటోంది తెలుసా."

"ఛా.. ఏమిటమ్మా ఆ మాటలు- నీవు కూడా అలా మాట్లాడుతావేంటి?" బాధగా అంది నిర్మల.

"నేననడం ఏమిటే, ఊరంతా చెప్పుకుంటున్నారు. అది చేసిన వెధవపనికి అందరూ తిట్టిపోస్తున్నారే- వాళ్ళ ఫ్లాట్‌లో ఉంటారే మధుసూధనరావుగారు, ఆవిడ అంతా చెప్పుకొచ్చింది భాగోతం. మొగుడు పోయిన రెండు నెలలకే వాడొచ్చి ఇంట్లో తిష్ట వేశాడట. భోజనం, పడక అంతా ఇంట్లోనేట. నిప్పు లేందే పొగ రాదు- వూరికే తిని కూర్చుని జనం చెప్పుకుంటారా- ఆ మధుసూధనరావుగారి భార్య చెప్పింది అంతా. అంతా ఛీ కొడ్తున్నారట. ఎంత ధైర్యం.. ఎంత బరితెగించింది. చూడు. లోకం ఏమనుకుంటుందోనన్న యింగితం అన్నా ఉండొద్దూ.. యిద్దరు పిల్లల్ని పెట్టుకుని యిదేం వెధవ పని. మొగుడు చచ్చిన రెండునెలలకే మొగుడు లేకుండా ఉండలేని స్థితికి వచ్చిందా. వళ్ళు కొవ్వెక్కి.." కమలమ్మ తిరస్కారంగా అంది.

నిర్మల ఆ మాటలు నమ్మలేకపోయింది. జానకి తనకి చిన్నప్పటినించి స్నేహం. మనిషి మెతక. బిడియస్థురాలు. గట్టిగా తనకేం కావాలో కూడా చెప్పలేని పిరికి. అలాంటిది ఇంత తెగింపు ఆమెలో వచ్చిందంటే అపనమ్మకం అనిపించింది. స్కూలుమాష్టరు తండ్రికి మూడో ఆడపిల్లగా పుట్టిన ఆమెకి ఏ విషయంలోనూ ఛాయిస్ గానీ, స్వంత అభిప్రాయం గానీ లేక, వున్నా చెల్లక.. తండ్రి మెట్రిక్ చదువాపేసి ఇంక చదివించలేనంటే తలదించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది. పంతొమ్మిదేళ్ళకే బ్యాంకు గుమాస్తాతో పెళ్ళి తూతూ మంత్రంలా జరిపించేస్తే తల దించుకుని పుస్తె కట్టించుకుని.. పదేళ్ళ కాపురంలో ఇద్దరు పిల్లల తల్లి అయి ఒద్దికగా, ఉన్నదాంతో తృప్తిగా బతికే లోయర్ మిడిల్‌క్లాస్ గృహిణి- బ్యాంకు లోను తీసుకుని వూరికి అవతల కొత్తగా కట్టిన ఫ్లాట్లు చవకగా వస్తుంటే అప్పుచేసి చిన్న ఇల్లు కొనుక్కున్నార, తమకంటూ ఓ ఇల్లుండాలని. లోను తీర్చుకుంటూ చాలా ఇబ్బందులు పడడం తెలుసు తనకి. ఇద్దరూ ఓ వయసువాళ్ళయినా, అంతస్తులో తేడా ఉన్నా చిన్నప్పటినించి మెట్రిక్‌వరకు క్లాస్‌మేట్స్ కనుక జానకితో స్నేహం బాగానే ఉండేది. తను ఈ పదేళ్ళలో ఎమ్మే చేసి పెళ్ళి చేసుకుని విశాఖపట్నం వెళ్ళిపోయింది. అప్పుడప్పుడు పుట్టింటికి వచ్చినప్పుడు జానకిని కలిసేది. ఆర్నెల్లక్రితం జానకి భర్త ఏక్సిడెంట్‌లో పోతే అది ఏడ్చిన ఏడ్పుకి గుండెలు తరుక్కుపోయాయి. ఇటూ అటూ ఆదుకునేవారెవరూ లేక, ఉన్న ఆధారం భర్త అంత చిన్నతనంలో పోతే, పిల్లలను పెట్టుకుని నేనెలా బతకాలే, దిక్కులేని దాన్నయిపోయానే అని అది ఏడ్చిన ఏడుపు గుండెల్ని పిండింది. అలాంటి జానకి ఆర్నెల్లు తిరక్కుండానే ఇంతకి తెగించే స్థాయికి ఎదిగిందంటే నమ్మశక్యంగా లేదు నిర్మలకి.

'ఏమిటోనమ్మా.. లోకం.. ఇదిగో పులి అంటే అదిగో తోక అంటారు. అసలు సంగతి ఏమిటో తెలియకుండా యిలా అనుకోవడం ఏమిటి..' నిర్మల ఏదో అనబోయింది.

"ముందు నేనూ అలాగే అనుకున్నానే. ఆ మధ్య నాకు బజార్లో కనిపించిందే జానకి. నన్ను చూసి సిగ్గు లేకుండా నవ్వుతూ పలకరించింది. మనిషి శుభ్రంగా, హాయిగా ఉంది. బొట్టు అదీ చక్కగా పెట్టుకుంది."

"అమ్మా- ఏమిటమ్మా ఆ మాటలు, బొట్టు అందరూ పెట్టుకుంటున్నారు ఇప్పుడు.."

"సర్లే.. అదలా ఉంచు. పిన్నిగారూ బావున్నారా. నిర్మలెప్పుడొస్తుంది అంటూ మాట్లాడింది. నాకు లోపల్లో పల మండిపోతూందేమో. నాకెందుకులే అని వూరుకుందామనుకున్నా వూరుకోలేక పోయానే అనుకో, - మాటల్లో అడిగినట్లు ఫలానా మధుసూదనరావుగారు మీ ఫ్లాట్స్‌లోనే ఉంటారుగా ఆవిడ చెప్తూ ఉంటుంది నీ కబుర్లు అన్నా" అంతే, దాని మొహం మాడిపోయింది. తన సంగతి అంతా తెల్సిపోయిందనుకుంది. 'ఆవిడ మీకు తెలుసా, అహ్, నాకు తెలియదు ఆ విషయం' అంది నవ్వు మొహాన పులుముకుని.

"ఏమిటి జానకీ, యిదేం బాగాలేదు.. అవిడ నీ గురించి ఏమిటేమిటో చెప్పింది. నీవూ, నిర్మలా వేరు కాదు నాకు.. నీ గురించి యిలాంటి మాటలు వినాల్సి వస్తుందనుకోలేదు-' అన్నాను నిష్ఠూరంగా. మరింత మొహం మాడిపోయిందనుకో. 'ఏమిటి, ఏం చెప్పిందావిడ!' తెలీనట్టు అడిగింది. 'అదే.. మీ ఇంట్లో ఏవరో సుధాకర్ అని వుంటున్నాడుట కదా..' నిష్కర్షగానే అడిగేశాను-'అవునండి ఉంటున్నాడు.. నాకు పేయింగ్ గెస్ట్‌గా .. అది కూడా అందరికీ బాధేనా-' అంది ఆవేశంగా. పేయింగ్‌గెస్ట్‌ట.. మంచిపేరే పెట్టింది. చేస్తున్న వెధవపనికి. వయసులో ఉన్న మనిషి ఇంకోడిని తీసుకొచ్చి యింట్లో పెట్టుకుంటుందా. లోకం హర్షిస్తుందా.. ఆ మాత్రం ఇంగితం ఉండొద్దూ.."

"అమ్మా.. నిజంగా పేయింగ్‌గెస్ట్‌గానే తీసుకుందేమో- మొగుడు పోయాడు. డబ్బు కోసం పెట్టుకుందేమో-' జానకి గురించి ఇంకేమీ ఆలోచించలేక అంది నిర్మల.

"ఊరుకోవే.. దానికి నీ వత్తాసు.. సిగ్గులేకపోతే సరి. పేయింగ్‌గెస్ట్ కావలిస్తే ఏ ఆడవాళ్ళనో తీసుకోవచ్చు కదా. మొగుడి స్నేహితుడిని అదీగాక పెళ్ళికాని వాడ్ని యింట్లో పెట్టుకుంటుందా..' కమలమ్మ కోపంగా అంది. 'అలా అడిగానని మొహం తిప్పుకుని విసవిస వెళ్ళిపోయింది తెలుసా' అంది ఆవిడ.

"ఏంటోనమ్మా- జానకి అలాంటిది కాదనిపిస్తోంది నాకు. నిజానిజాలు తెలుసుకోకుండా అందరిలా మనమూ అనడం బాగు లేదు. నీకు మాత్రం తెలీదా చిన్నప్పటినించి దాన్ని-"

"తెలుసు కనుకే బాధ- తెలిసున్న పిల్ల కనుకే ఏమిటిది ఛా అన్పిస్తోంది. లోకంలో జరిగేవన్నీ మనం పట్టించుకుంటామా.. తెల్సినది కాబట్టే ఛా.. ఛా అంటున్నాను." మనసులో దాచుకున్న ఆ మాట చెప్పేసి బరువు దించుకున్నట్లు ఆవిడ వంటింట్లోకి వెళ్ళిపోయింది. జానకితో మాట్లాడి గాని ఓ నిర్ణయానికి రాదలచలేదు నిర్మల.

* * *

తలుపు తీసి నిర్మలని చూడగానే జానకి మొహంలోకి ఒక్కసారిగా వెలుగు వచ్చింది. 'నీవా' అంది ఆనందంగా. అంతలోనే మబ్బులు కమ్మిన సూర్యుడిలా మొహం నల్లబడింది.. 'రా లోపలికి. చాలా రోజులయిందే ఈసారి వచ్చి-' అంది మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ. "చాలా రోజులేమిటి, ఆర్నెల్లు అయింది. అది సరే.. ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావు.. బ్యాంకులో ఉద్యోగం ఇచ్చారా.. అటు ఉద్యోగం, ఇటు వంటరిగా

పిల్లలతో ఎడ్జస్ట్ అయి ఉంటావు ఈపాటికి..'' కూర్చుంటూ అంది నిర్మల చుట్టూ చూస్తూ. రెండు బెడ్‌రూముల ఫ్లాట్ అది.. ఒక బెడ్‌రూం తాళం వేసి ఉంది. ఆదివారం.. ఆ సుధాకర్ ఇంట్లో లేడు కాబోలు అనుకుంది నిర్మల.

''ఏదో వున్నాను.. బతుకు ఈడ్చాలి గదా.. పిల్లల కోసమేనా బతకక తప్పదు కదా.. యిప్పుడిప్పుడే పరిస్థితులతో అడ్జస్ట్ అవగలిగే మనస్థైర్యం వచ్చింది. భగవంతుడే ఆ ధైర్యం ఇస్తాడేమో' విషాదంగా అంది.

''బ్యాంక్‌లో క్లాస్‌ఫోర్ ఉద్యోగమే ఇచ్చారే..?''

''మరేం ఇస్తారు. నా చదువు తెల్సుగదా- మెట్రిక్ చదివిన నాకేం వస్తుంది అంతకంటే. ఏదో ఈ కొత్తరూల్స్ పుణ్యమా అని భార్యలకీ, లేదా డిపెండెంట్స్‌కీ యిస్తున్నారు కనక బతికిపోతున్నాం నాలాంటివాళ్ళం. ఏమిటో మొదట్లో అటెండర్ ఉద్యోగం అంటే ఏదో చిన్నతనంగా ఉండేది.. మాలాంటి మధ్యతరగతి వాళ్ళం యిటూ కాకుండా, అటూ కాకుండా వున్నాం. చిన్నతనం తీనుకుంటే రోజులు వెళ్ళాలిగా. ఇప్పుడు అలవాటయిందిలే'' అంది శుష్కహాసం చేస్తూ-

''మీ ఆయన ప్రావిడెంట్ ఫండు, గ్రాట్యువిటి అవి వచ్చేశాయా..''

''అ.. వచ్చాయి.. ఏ మాత్రం గనక.. పట్టుమని పదేళ్ళు, అందులో రెండేళ్ళు మొదట్లో ఎక్కడో చేశారు. ఈ ఎనిమిదేళ్ళది ఏ మాత్రం వస్తుంది. అందులో కొంత లోనుగా యింటికోసం తీసుకున్నారు కదా.. ఏదో వచ్చింది కాస్త అప్పుగా చెల్లు కట్టాను.. ఏదోపాపం ఆ సుధాకర్ ఉండి ఆ పనులన్నీ చేసి పెట్టారు గనక గానీ లేకపోతే నా వల్ల అయ్యేది కాదు..''

సుధాకర్ పేరు మాటల్లో రావడంతో సుధాకర్ గురించి అడగడానికి యిదే సమయం అన్పించింది నిర్మలకి- 'జానకీ, నేనో మాట అడుగుతే ఏం అనుకోవు కదా..' నిర్మల సందేహంగా అడిగింది.

''హు..' జానకి అదోలా నవ్వింది. 'నాకు తెల్సు! నువ్వేం అడుగుతావో, సుధాకర్ గురించేనా నీ ప్రశ్న. అడుగు, అడుగు. అందరిలా నీవూ అను. ఎవడినో ఇంట్లో తెచ్చిపెట్టుకుని కులుకుతున్నావా అని అడుగు, మొగుడు పోయిన రెండు నెలలకే మరో మగాడి పొందు కావల్సి వచ్చింది అని మొహాన ఉమ్మేయడానికే వచ్చుంటావు.. అడుగు అడుగు. ఏం అడగదల్చుకున్నావో. మహారాణిలా అడుగు.. యీ నాలుగు నెలలనించి అందరి మాటలు విని బాధపడే స్టేజినించి దాటిపోయాను. మరేం ఫరవాలేదు. అడుగు-' వ్యంగ్యంగా మొదలుపెట్టి, ఆవేశంతో ముగించింది. జానకి మొహం ఎర్రబడి, కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'జానకీ..' నిర్మల దెబ్బ తిన్నట్లు చూసింది. 'జానకీ.. ఆ మాటలన్నీ నేనూ నమ్మాననుకుంటున్నావా.. నమ్మలేకే అసలు సంగతి నిన్నే అడగాలని వచ్చాను.. ఈనోటా, ఆనోటా వినడం కంటే నీ ద్వారా వినడమే నయం అనుకుని వచ్చాను. నిన్ను అడిగే అధికారం లేదనుకో- అయినా స్నేహితురాలిననుకుంటే, చెప్పాలనుకుంటే చెప్పు..''

''నిర్మలా.. ఈ ఆర్నెల్లుగా నేను పడిన వేదన చెప్పుకోవడానికి నీవు తప్ప నాకింకెవరున్నారు.. కానీ, నిజంగా నేనేం పాపం చెయ్యలేదు అంటే నీవు నమ్ముతావా. నా పిల్లల మీద ఒట్టేసి చెపుతున్నాను. అంటే నమ్మాలి నీవు.'' కళ్ళు తుడుచుకుంటూ గద్గదికంగా అంది.

''ఛా.. ఊరుకో .. నాకు తెలుసు.. ఇవేవో పుకార్లని.. మా అమ్మతోనూ అదే అన్నాను..' నిర్మల ఓదార్పుగా అంది.

'అవును. ఆఖరికి మీ అమ్మగారు కూడా మొఖానే అడిగేశారు. నిర్మలా.. సుధాకర్ ఆయనకి స్నేహితుడే. నాకు తోడబుట్టినవాడితో సమానం. నిజంగా నా కష్టకాలంలో అన్నివిధాల అతను ఆదుకున్నాడే. ఆయన పోయాక ఆఫీసు డబ్బులు రావడానికి, నాకుద్యోగం రావడానికి ఎంత తిరిగి చేశాడో.. అతని ఋణం తీర్చుకోలేనిది అనుకో.. 'అది సరే.. బాగానే ఉంది. కానీ ఈ గొడవేమిటి. యింట్లో ఎందుకుంటున్నాడు అతను.. నలుగురూ నాలుగు విధాల అనుకునే అవకాశం...''.

''చెపుతా ఉండూ- నిర్మలా నీకు తెలుసా, నాకు ఇటు అటు ఈ సమయంలో ఆదుకునే వారెవరూ లేరని- అటు నాన్నగారు పోయారు. ఇటు మామగారూ అత్తగారూ ఉన్నవాళ్ళకే దిక్కు లేక పెద్దకొడుకు ఇంట్లో ఉన్నారు. ఇంక ఈ పిల్లలిద్దరిని పెట్టుకునే బతుకీడ్చాలి అనుకుంటే భవిష్యత్తు భూతంలా భయపెట్టి రెండునెలలు కుళ్ళి కుళ్ళి ఏడ్చాను. ఆ సమయంలో దేముడే పంపినట్లు పాపం సుధాకర్ కేవలం ఆయన స్నేహితుడిగా నా మీద సానుభూతితో సాయం చేశాడు. ఉద్యోగం ఏదో ఇప్పించారు. ఆ డబ్బు ఆ డబ్బుతో ఒకటొకటిగా రోజులు వెళ్ళదీయవచ్చు- ఆయన ఉండగా లోను తీసుకుని ఈ ఫ్లాటు తీసుకున్నాం కదా, నెల నెల దీనికి పదిహేను వందలు లోను కట్టాలి. వచ్చే ఆ జీతం తిండికే సరిపోతుంది., ఈ అప్పు ఎలా తీర్చను.. లేకపోతే యిల్లు వదులుకోవాలి, వదిల్తే యీ నీడ కూడా లేకపోతే ఒక్కగదికే ఏడెనిమిది వందలు అద్దెలు పోసి అద్దింట్లో బతకాలి- ఇల్లు పోతే మళ్ళీ జన్మలో కొనడం నా వల్ల అయ్యే పనా- ఏం చెయ్యాలి భగవంతుడా అన్న దిగులుతో ఉన్న నాకు సుధాకర్ దారి చూపించాడు. ఇతడు బ్యాచిలర్. ఏదో రూము తీసుకుని హోటల్లో భోంచేస్తున్నాడు. ఇంట్లో రెండు బెడ్‌రూములున్నాయి కనుక.. అటాచ్‌బాత్ ఉన్న బెడ్ రూము అద్దెకి తనుంటానన్నాడు. ఎలాగో ఇంట్లో ఉంటాడు కనుక భోజనం అదీ కూడా యిక్కడే తింటూ పేయింగ్ గెస్ట్‌గా ఉండి మొత్తం పదిహేనువందలు ఆ లోనుకి తను డబ్బు కట్టేస్తానన్నాడు...''

''పేయింగ్ గెస్ట్‌గా కావాలంటే పోనీ ఎవరినైనా ఆడవాళ్ళని పెట్టుకుంటే యీ మాట వచ్చేది కాదు కదా..' నిర్మల మధ్యలోనే అడ్డింది.

'నిర్మలా, నిజం చెప్పనా. అసలు సుధాకర్ ఆ మాట అనగానే ఆనందంతో అంత దూరం ఆలోచించలేదు. అసలు లోకం ఏమనుకుంటుందోనన్న ఆలోచన కూడా రాలేదు. నా ప్రాబ్లమ్ సాల్వ్ అయి పోయింది, ఇల్లు నాకుంటుంది అన్న సంతోషంతో అతని ప్రపోజల్‌కి ఎగిరి గంతేసినట్లు వప్పేసుకున్నాను. పాపం సుధాకరూ నాకేదో సాయం చేస్తున్నాననుకున్నాడే కాని యిలాంటి మాటలు వినాల్సి వస్తుందని అతనూ అనుకోలేదు. నీరూ.. నిజంగా సుధాకర్ నాకు తమ్ముడి లాగే ఉన్నాడే. ప్రతిదానికి నాకు సాయంగా వుంటాడు. నా అన్నతమ్ములు నేను చచ్చానో, బతికానో కూడా పట్టించుకోలేదు. ఎలక్ట్రిసిటీ బిల్ కట్టడం, లోన్ కట్టడం, పిల్లలకి ఏదన్నా కావలిస్తే అన్నింట్లో ఇంటిమనిషిలా వున్నాడు. అలాంటి అతని గురించి లోకం ఏదో అను కుంటూంది అన్నది కూడా రెండు నెలలవరకూ నాకు అర్థం కాలేదు.. ' వ్యధగా అంది.

'అసలు ఇదంతా ఎలా మొదలయింది.. ఈ అపవాదు ఏవరారంభించాడు..'


'ఎవరారంభిస్తారు- ఇరుగు పొరుగు, అందులోనూ ఈ ఫ్లేట్ లైఫ్‌లో మనింట్లో ఏం జరిగేదీ అందరికీ తెలుస్తుంది. అందరికీ ఎవరొచ్చేదీ, ఎవరు పోయేదీ అన్నీ కనిపిస్తూనే ఉంటాయి. గట్టిగా మాట్లాడుకున్నా వినిపిస్తాయి. 'యీ అబ్బాయి ఎవరూ' అంటూ ఆరాలు మొదలెట్టారు. నేనూ తెలివితక్కువగా ఏదో కజిన్‌బ్రదర్ అనేదో చెప్పకుండా మా వారి స్నేహితుడు అంటూ చెప్పాను. 'అదేమిటి, ఇక్కడే ఉంటాడా, ఇక్కడే పడుకుంటాడా'.. లాంటి వ్యంగ్యపు విసుర్లతో ఆరంభించినా తెలుసుకోలేని మొద్దుని అనుకో.. వీళ్ళు వాళ్ళు చెవులు కొరుక్కోవడం, పనిమనిషి వీళ్ళిలా అన్నారు, వాళ్ళిలా అంటున్నారు అంటూ కబుర్లు మోసుకు వచ్చేది. చాకలి, పాలవాడు అంతా సుధాకర్‌ని వింతగా చూడటం.. కొన్నాళ్ళకి ఎదురింటావిడ, పక్కింటావిడ అంతవరకు నామీద జాలి, సానుభూతి కురిపించిన వాళ్ళు నా మొహం మీదే తలుపు వేయడం, పలకరించినా తిరస్కారంగా వెళ్ళిపోవడం.. పిల్లల్ని కూడా మా పిల్లలతో కలవనీయక పోవడంలాంటి సాధింపుచర్యలు ఆరంభించారు. మొత్తం వున్న పదిహేను ఇళ్ళవాళ్ళు నేను పబ్లిక్‌గా మొగుడు చచ్చిన రెండునెలలకి బరితెగించి మొగాడి కోసం కరువు వాచినట్లు ఎవరినో పెట్టుకుని కులుకుతున్నట్లు తేల్చేశారు.''

''వున్న సంగతి చెప్పకపోయావా- ''

'ఎందుకు చెప్పలేదు- డైరెక్ట్‌గా అడిగినవారికి, అడగనివారికి పేయింగ్‌గెస్ట్‌గా ఉంటున్నట్లు చెప్పాను- ఎగతాళిగా 'మంచిపేరు దొరికింది', 'భలే సదుపాయమే- అన్నింటికి సరిపోయే పేయింగ్ గెస్ట్‌లు ఎంతమందికి దొరుకుతారు' లాంటి మాటలు పిల్లిమీద, ఎలుకమీద పెట్టి వాళ్ళలో వాళ్ళు అనుకోవడం నేను వినేట్టు, నేను బయట కనిపిస్తే చాలు మొహాన తలుపు దడాలున వేయడం, మూతి తిప్పుకోవడం.. తిరస్కారంగా చూడడం.. అబ్బ .. నిర్మలా లోకం అంతా నామీద పగ పట్టినట్టు ఎందుకు ప్రవర్తిస్తారు. నా బతుకు నన్ను బతకనీయకుండా నన్నెందుకిలా మాటలతో చిత్రవధ చేస్తారు. మొగుడు చచ్చిన ఓ స్త్రీ మీద సానుభూతి లేకపోగా యీ మాటలు.. '' జానకి గొంతు రుద్ధమయింది.

'నుధాకర్‌కి ఇదంతా తెలుసా.. అతనేం అంటాడు..'

'అతనికీ ముందు కొన్నాళ్ళు తెలియదు-. ఈ బిల్డింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఓ రోజు అతన్ని పిలిచి, ఇవి సంసారులుండే కొంపలు.. మీరిలా బరితెగించిపోతే ఎలా అన్నట్లు మాట్లాడారుట. పాపం సుధాకర్ అర్థం కాక బిత్తరపోయాడుట. అంతకుముందు




జరిగిన విషయాలు అతనికి ఎలా చెప్పాలో అర్థం కాక నేను చెప్పలేదు. ఆ రోజు పాపం అతను అవమానంతో, సిగ్గుతో తలెత్తలేక పోయాడు.

"వదినగారూ, ఏమిటండీ యిది. వీళ్ళు మనుషులేనా- ఓ స్త్రీ, పురుషుడు కలిసిఉంటే ఓ నీచబంధం తప్ప వీళ్ళకేం తట్టదా. మీరిన్నాళ్ళు నాకెందుకు చెప్పలేదు.." అన్నాడు. అంతా విని అతను కోపం వచ్చి- 'ఇది మా పర్సనల్ మాటర్, నేనెందుకు ఉన్నానో, ఆవిడ నన్నెందుకు ఉంచుకుందో అడిగే హక్కు మీకు లేదు. మీ ఇంట్లో ఎవరుంటున్నారో, ఎవరెడుతున్నారో మేమడిగామా-' అంటూ దులిపేసి వచ్చాడుట. అ రోజు నుంచి

సూటిపోటి మాటలు మరింత ఎక్కువయ్యాయి. ఇది వరకు ఇన్‌డైరెక్ట్‌గా అనేవాళ్ళు డైరెక్ట్‌గానే 'సిగ్గులజ్జా విడిచేసినవాళ్ళకేం చెప్పలేం, బరితెగించిన వాళ్ళకేం' అంటూ మొదలుపెట్టారు కసిగా.

"పోనీ సుధాకర్‌ని పంపించేసి, ఇంకెవరినన్నా.. " నిర్మల మాట పూర్తి కాలేదు, 'నిర్మలా నీవూ అలాగే అంటావా..' కోపంగా చూసింది జానకి.

"ఈ వెధవజనం కోసం, యీ కాకుల కోసం నా తోడుని వదులుకోవాలా. మొదట్లో బెంబేలు పడిపోయాను. ఏడ్చుకునే దాన్ని. కుమిలిపోయేదాన్ని. వీళ్ళమాటలు విని నాలో ఏదో తెగింపు వచ్చేసింది. అనుకోనీ వెధవల్ని నేనెందుకు కేర్ చెయ్యాలి అని పంతం వస్తూంది.."

"అవుననుకో, కాని జనం మధ్య ఉండాల్సినవాళ్ళం. నీకూ పిల్లలున్నారు. ఇలాంటి చెడ్డపేరు వస్తే రేపు వాళ్ళ పెళ్ళిళ్ళు.. సమాజంలో ఉంటూ ఎదిరించి బతకడమూ కష్టమే.. మనుషులకు కనిపించేదే నిజం అని నమ్ముతారు.. న్యాయానికి కళ్ళు లేనట్టే, సమాజానికి కళ్ళు తప్ప చెవులుండవు.." 'అయితే ఏం చెయ్యమంటావు- సుధాకర్‌ని పంపించేసి అవస్థ పడమన్నావా.. ఎవరి కోసమో నా స్వలాభం వదులు కోవాలా.. వీళ్ళ ముందు తప్పు చెయ్యకపోయినా తల దించుకోవాలా.. ఈ అన్నవాళ్ళంతా రేపు నాకు సాయం చేస్తారా..'

నిర్మల ఆలోచనలో పడింది. ఆఖరికి 'వుండు, మీ సెక్రటరీ మధుసూదనరావుగారు మాకు బాగా తెల్సు. ఆయనతో మాట్లాడి.. ఏదో ఆలోచిస్తాను, నేచెప్తానుండు..' అంది సాలోచనగా.

✲ ✲ ✲

ఆరోజు.. ఆ అపార్ట్‌మెంట్స్‌లో అందరినీ సమావేశపర్చింది నిర్మల. నిర్మల చెప్పిందానికి సగం అయిష్టంగానే అంగీకరించింది జానకి. పిల్లల భవిష్యత్తు ఆలోచించి ఒడిపోవడం ఇష్టం లేకపోయినా అంగీకరించింది.

"చూడండి.. మిమ్మల్నందర్నీ ఇక్కడ సమావేశపరచింది మీకున్న కొన్ని కొన్ని అపోహలు తొలగించడానికి.. జానకి నా చిన్ననాటి మిత్రురాలు. - దాని దురదృష్టం కొద్దీ భర్త చిన్నతనంలో పోయాడు. ఏదో బ్యాంకివాళ్ళ ధర్మమా అని ఓ ఉద్యోగం, భర్త ముందుచూపుతో ఓ ఇల్లు ఉండబట్టి రోడ్డున పడకుండా, ఎవరిముందూ చెయ్యి చాచకుండా దాని పిల్లలని పెంచుకోగలుగుతోంది. అలాంటి ఆమెకి.. యిక్కడ మీరందరూ ఇళ్లుకొనుక్కుని ఉన్న ఓ కుటుంబంలా ఓ చోట ఉంటున్నారు. యిదొక పెద్ద సంసారంలాగా కలిసిమెలిసి, అపార్ట్‌మెంట్‌ల వాళ్ళుండాలి. కాని దురదృష్టవశాత్తూ మీరందరూ తనకి సహాయం, సానుభూతి చూపాల్సిందిపోయి"- 'మా సానుభూతులు, సహాయాలు ఆవిడకెందుకండి-' ఎవరో వెనకనుంచి కిసుక్కున నవ్వారు. 'అదే ఈ రోజు మీ అందరి అపోహలూ తొలగించాలనే మీ అందరినీ రమ్మన్నాను. డబ్బు అవసరం కోసం స్వంత సోదరుడి లాంటి సుధాకర్‌ని యింట్లో పేయింగ్‌గెస్ట్‌గా పెట్టుకుంది తను."

"నన్ను పెట్టుకుంటే ఉండనన్నానా!' ఏ యువకుడో వెనుకనుంచి చిలిపిగా అన్నాడు. అంతా నవ్వారు. నిర్మల తీక్షణంగా చూసింది- 'ప్లీజ్! మీరంతా చూస్తే చదువుకున్నవాళ్ళలా ఉన్నారు. కాస్త సంస్కారం కనబరచండి. తోటి స్త్రీ మీద స్త్రీకైనా సానుభూతి లేకుండా మాట్లాడటం అన్యాయం. ఇంతకీ మీ అందరికి సుధాకర్‌ని ఆమె బరితెగించి ఇంట్లో పెట్టుకున్నదనేగా అభ్యంతరం- అందుకే మీ అపోహ తొలగించడానికే రమ్మన్నాను.-" నిర్మల గుమ్మంలోంచి వెళ్ళి ఓ పళ్ళెం పట్టుకు వచ్చింది. అందులో వెలుగుతున్న దీపం, కుంకం, స్వీటు, రాఖీ ఉన్నాయి. "ఇదిగో. ఇది రాఖీ. ఓ సోదరి, సోదరుడికి పవిత్రంగా కట్టే రాఖీ. అది



ఈరోజు మీ అందరి ముందూ సుధాకర్‌కి కడుతుంది. అతన్ని మీ అందరిముందూ సోదరుడిగా స్వీకరిస్తుంది. ఇది కేవలం మీ అపోహ తొలగించడానికి. మిమ్మల్ని నమ్మించాల్సిన అవసరం తనకు లేకపోయినా, నేను ఒప్పించాను. ఓ కుటుంబంలా కల్సి మెల్సి ఉండాల్సిన చోట అసహ్యమైన మాటలు, అపోహలు వుండకూడదని నేనే సలహా యిచ్చాను..' సుధాకర్ ఇటురండి.." నిర్మల అంది.

"మంచి ఐడియాలే. ఓ దారం ముక్క కట్టేస్తే, కట్టించేసుకుంటే ఇంక వెనకాల ఏ నాటకాలాడినా ఫరవాలేదు. బలే సలహా' ఎవరో అన్నారు. నిర్మల అటు తీక్షణంగా చూసింది. జానకి చేతిలో రాఖీ విసిరికొట్టింది. క్రోధావేశాలతో ఎగిరిపడ్తున్న గుండెలతో, "చూశావా, నిర్మలా, వీళ్ళు ఎలాంటి మనుష్యులో.. హు.. దారం ముక్కట- ఆ దారం పోగులే మీ మీ బ్రాహ్మణత్వం చూపుకోడానికి పవిత్ర జందెంగా వేసుకుంటున్నారు. ఈ పతివ్రతలందరూ మెడలో కట్టించుకునేదీ ఆ దారం పోగులే. హు.. రాఖీ పవిత్రత ఏమిటో తెలియని వీళ్ళనా నీవు నమ్మించాలనుకున్నావు..' ఆవేశంగా అంది.- అందరివంకా తిరస్కారంగా చూస్తూ "మీరంతా ఒక మాట ఇస్తే ఈ సుధాకర్‌ని ఈ క్షణంలో పంపేస్తాను-" అందరూ ప్రశార్థకంగా చూశారు. "ఇక్కడ పదిహేను ఇళ్ళున్నాయి. మీరంతా నెలకి తలా వందా ఇస్తే నా ఇంటి అప్పు తీర్చుకుంటాను. అప్పుడు సుధాకర్‌ని పంపేస్తాను- ఏం ఇస్తారా?' జానకి హేళనగా అంది. 'మాకేం పట్టింది...' అదే నా ఇబ్బందులు మీకు అనవసరం అయినప్పుడు, నా జీవితంలో ఏ విషయం లోనూ కలుగజేసుకునే అధికారం మీకు లేదు. ఇది నా స్వవిషయం..' ఆవేశంగా అంది. సుధాకర్ జరుగుతున్నదంతా చూసి, ఏదో నిర్ణయించుకున్న వాడిలా పళ్ళెంలో కుంకుమబరిణె తీసుకుని జానకి ముందుకు వచ్చాడు. 'నిర్మలగారూ! చాలు, ఈరోజు ఈ జరుగుతున్నదానికి ఫుల్‌స్టాప్ పెట్టేస్తాను.. జానకిని పెళ్ళాడి అందరి నోళ్ళూ మూయిస్తాను..' ఆవేశంగా అన్నాడు. 'నాయనా, ఈ పని ముందే చేసి ఉంటే మేము నోరు మూసుకుని వుండేవాళ్ళం కదా' హేళనగా అన్నారు ఎవరో. జానకి సుధాకర్‌ని తీక్షణంగా చూసింది- అడుగు వెనక్కు వేసింది. 'ఆగు, సుధాకర్, ఇదేం సినిమా కాదు- ఎవరో ఏదో అన్నారని కుంకం పెట్టేస్తే పెళ్ళయిపోడానికి.. ఆవేశంతో పిచ్చిపని చేసి వదినగారూ అని పిల్చిన పిలుపుకి అపవిత్రత అంటగట్టకు.. ఇద్దరు పిల్లల తల్లిని, మొగుడు పోయిన దాన్ని పెళ్ళాడాల్సిన ఖర్మ నీకేంటి- నేనేం రంభను కాదు, అందం చూసి చేసుకోడానికి. ఐదువేలు తెచ్చుకుంటున్నావు. చక్కటి పిల్ల నీకు దొరుకుతుంది. - నా మీద జాలితో, ఆవేశంతో చేసి, నీవాళ్ళతో విరోధం తెచ్చుకుని, ఆవేశం తగ్గాక పిచ్చిపని చేశానని, నీవు బాధపడి, నన్ను బాధపెట్టి మన జీవితాలు నరకం చేసుకోవద్దు. ఎవరికోసమో ఇలాంటి పని చెయ్యకు. మన మధ్య ఉన్న అనుబంధాన్ని, పవిత్రతని ఈ మూర్ఖులు అర్థం చేసుకోకపోతే అలాంటివాళ్ళ కోసం మనం బాధపడక్కరలేదు. నీ పెళ్ళయ్యే వరకు ఇక్కడే ఉండు, రేపటినుండి నా జోలికి ఎవరైనా వస్తే పోలీస్ కంప్లైంట్ యిస్తాను నన్ను హరాస్ చేస్తున్నారని. వెళ్ళండి. అందరూ వెళ్ళండి. మీ ఇష్టం వచ్చినట్టు మీరనుకోండి. నాకేం అక్కర లేదు." జానకి ఆవేశంగా అందరినీ దులిపేసి విస విస వెళ్ళిపోయింది.

అమాయకురాలు, ఎలా బతుకుతుందో అన్న జానకి, అట్టే చదువుకోని జానక్కి ఎంత ధైర్యం వచ్చింది. .. నీటి ప్రవాహంలో పడిన వారికే నీటికి ఎదురీదే ధైర్యం, సాహసం వస్తాయి గాబోలు! గదిలో పెట్టి కొడితే పిల్లి కూడా పులి అవుతుందంటే ఇదేనేమో! ఈ సమాజాన్ని ఎదిరించి బతకాలంటే మొండిధైర్యం, తెగింపు ఉండాలి జానకిలాంటి నిస్సహాయులకి! అది పరిస్థితులే కల్పిస్తాయేమోననిపించింది నిర్మలకి. ❑